# హింస రచన

మామయ్య రావద్దు.. మామయ్య రావద్దు... మామయ్య రానే రావద్దు..

మామయ్యెందుకొస్తున్నాడు...?

అతన్నెవరు రమ్మన్నారు???

మామయ్యతమింటికి రాద్దు...

మామయ్య రాకుంటేనే బాగుంటుంది? ఈ సారి మామయ్య తనింటికొస్తే దోస్తి కటీఫే...

తనేంటి ఇలా ఆలోచిస్తున్నాడు...? మామయ్యంటే తనకెంతిష్టం..? తనంటే మామయ్య కెంత ప్రేమ..? తనెంతల్లరి చేసినా భరిస్తాడు...కోరిందల్లా కొనిస్తాడు... మామయ్య తమింటికొచ్చినా ఎంత సంతోషంగావుంటుంది...? క్రికెట్‌బ్యాట్, బాల్ తెస్తాడు... చెల్లికి బొమ్మలు తెస్తాడు... తనను పార్కుకు తీసుకెళతాడు.. సినిమాకు తీసుకెళతాడు... తమతోపాటు చిన్న పిల్లాడిలా ఆడుకుంటాడు.. మామయ్య ఉన్నన్ని రోజులు ఇంట్లో ఎంతో ఆనందంగా గడుస్తుంది.

తననెంత ముద్దు చేస్తాడు మామయ్య. తనకూ మామయ్యంటే చాలా ఇష్టమే.

కాని, తను మామయ్య ముద్దు చేసిందాని కంటే ఎక్కువగా తాను తన చెవులపిల్లిని ముద్దుచేస్తాడు. తెల్లగా పిండారబోసినట్టుండే వెన్నెలకంటే తెల్లగా వుండే కుందేలంటే తనకెంతో ముద్దు. అదంటే తనకు ప్రాణం. తన మిత్రుడు సందీప్ ఇంట్లో దాన్ని చూసి తనకు కావాలని పట్టుబట్టాడు... ఏడ్చాడు. చెవులపిల్లిని కొనుక్కొచ్చేంత వరకు బడికిపోనన్నాడు తను. అంగడికెళ్ళి అరుదుగా లభించే చెవుల పిల్లిని తన కోసం కొనుక్కొచ్చాడు నాన్న. అది వచ్చింతర్వాత దాంతోనే లోకమయింది తనకు. తనింట్లో ఉన్నంతవరకు హోంవర్కు చేసుకుంటున్నా, భోజనం చేస్తున్నా తనతోనుంచుకుంటున్నాడు.. తానేది తింటే అది తినిపిస్తున్నాడు. తాను స్కూలుకెళ్ళినా తన మనసంతా చెవుల పిల్లిపైనే. స్కూలు వదలగానే పరుగెత్తుకొస్తుందది... దాన్ని కుక్కల బారినుంచి కాపాడటానికి ఇంటికొచ్చిన రెండు కుక్కల కాళ్ళు విరగొట్టాడు తను. తనే దాన్ని చెవులు పట్టి లేపుతాడు... తన చెల్లెల్ని కూడా ఎక్కువసేపు ముట్టనివ్వడు.. తనకు కుందేలంటే ప్రాణం... ప్రాణం కంటే ఎక్కువ కూడా...

మామయ్యొస్తే తన కుందేలును కోసి వండుతానంది అమ్మ... నాన్న సరేనన్నాడు. మామయ్యొస్తే తన కుందేలునే ఎందుకొయ్యాలి...? కోళ్ళు కోసుకొనీ, గొర్రెల్ని కోసుకోని... కానీ ఓ ప్రాణినే చంపి తినకపోతేనేం. కూరగాయలు, పప్పులు వండితే సరిపోదా...? అమ్మకు బుద్ధిలేదు. తనెంత మొత్తుకున్నా

వినదు... మామయ్యొస్తే తన చెవుల పిల్లిని కోయించి వండుతుంది... అది తాను చూడగలడా...? చూసి భరించగలడా...? తన కుందేలు లేకుండా తాను బతుకగలడా...? అసలు మామయ్యే రాకుంటే తన కుందేలు బతికే వుంటుంది కదా... మామయ్య రాకుండానే నేం చెయ్యాలి...? లెటర్ రాస్తే... ఈ రెండ్రోజుల్లో అందుతుందా? అనుమానమే.. రావద్దని టెలిగ్రామిస్తే... తన దగ్గర డబ్బేది...? పాకెట్ మనీ ఐదు రూపాయలున్నాయి... అవి సరిపోతాయా? మరి తనకు మామయ్య అడ్రస్ తెలియదే... అమ్మనడిగితే చెప్పదు... తంతుంది. అయినా రమ్మని టెలిగ్రాం ఇస్తారు కాని రావద్దని ఇవ్వడమేంటి...? మామయ్య రాకను ఆపడంకష్టం... మరి తన కుందేలు...?? రెండురోజులుగా రకరకాలుగా ఆలోచిస్తున్నాడు తొమ్మిదేళ్ళ గౌతమ్. తన కుందేలును రక్షించుకోవడానికేం చేయాలో అతనికి తోచడం లేదు.

తానెంతో ప్రేమించే మామయ్య, తన నెంతో ముద్దుచేసే మామయ్య గౌతమ్ కళ్లకిప్పుడు యమధర్మరాజులా కనబడుతున్నాడు.

అతని రాక తన ప్రియాతి ప్రియమైన చెవులపిల్లి ప్రాణాలను లాక్కుపోవడానికొచ్చే విలన్ రాకలా కనిపిస్తోంది. రెండు రోజులుగా గౌతమ్ మామయ్య దగ్గర్నుండి లేఖ వచ్చినప్పట్నుంచి, తల్లి కుందేలును కోసి వండుతానన్నప్పట్నుంచి ఆ పసివాడు సరిగా భోజనం చేయడం లేదు. అతని కడుపు నిండా దుఃఖముంది... తల్లిపై కోపముంది... మామయ్యపై ఆక్రోశముంది.. తన చెవుల పిల్లిని కొయ్యొద్దని రెండుసార్లు అమ్మనడిగాడు... కాని ఆమె పసివాని మాటలని లక్ష్యపెట్టలేదు... తన కుందేలును రక్షించుకోవడానికేంచేయాలో గౌతమ్‌కు తోచడం లేదు.

కుందేలునాప్యాయంగా చేతుల్లోకి తీసుకున్నాడు... నొప్పిగా వున్న కాలును పుణికాడు... తలనాప్యాయంగా నిమిరాడు... ఒళ్ళంతా ప్రేమగా తాకాడు.

మామయ్య రావాలి... తాను వద్దనుకున్నా ఎలాగూ వస్తున్నాడు... కాని తన చెవుల పిల్లిని కోయకూడదు... ఎల్లాగైనా తన చెవులపిల్లిని రక్షించుకోవాలి. కాని ఎలా... ఎలా...?

అమ్మ తన మాట వినదు... తన మాటలకసలే విలువనివ్వదు.... నాన్ననడగాలి.. ఈ ఒక్కసారి నాన్ననడిగి చూడాలి... తన కుందేలును కొయ్యకుండ నాన్ననొప్పించాలి.

నాన్నతో వాదించడానికి రంగాన్ని సిద్ధం చేసుకుంటున్నాడు గౌతమ్. చరిత్ర మాష్టారు చెప్పిన గాంధి సిద్ధాంతాలను జ్ఞాపకం చేసుకున్నాడు... తెలుగు మాష్టారు చెప్పిన బుద్ధుని పాఠాన్ని నెమరు వేసుకున్నాడు. ఆఫీసునుంచి వచ్చే తండ్రి కోసం ఎదురుచూస్తున్నాడు గౌతమ్.

సాయంత్రం ఆరుగంటల సమయమవుతోంది. ఆఫీసు నుంచొచ్చిన సుధాకర్ చేతుల్లో కుందేలును పట్టుకొని కూర్చున్న గౌతమ్‌ను చూశాడు.

''హోంవర్కేవీ చేసావా? ఎప్పుడు చూసినా కుందేలే చేతుల్లో వుంటుంది'' అన్నాడు సుధాకర్ బట్టలు మార్చుకుంటూ... ''మ్యాథ్స్ చేశాను నాన్నా ఇంగ్లీషొక్కటుంది. రాత్రికి చేస్తాను''.

కొడుకు మాటలు విని తలూపుతూ టవల్ తీసుకొని బాత్ రూంలోకెళ్ళాడు సుధాకర్. స్నానం చేసొచ్చేవరకు కూడా అలాగే కూర్చున్న గౌతమ్‌ను పరీక్షగా చూశాడు. రెండు రోజులుగా గమనిస్తున్నాడు కొడుకును. ఏదో కోల్పోయిన వాడిలా ఉంటున్నాడు. ఆరోగ్యం బాగాలేదేమో ననుకుంటున్నాడు.

'' ఒంట్లో బాగాలేదా బాబూ?'' అన్నాడు సుధాకర్.

''బాగానే వున్నాను నాన్న''

''కాస్సేపలా ఆడుకొనిరా... తర్వాత చదువుకోవచ్చు''

ఆడుకొమ్మనగానే లేడిలా గెంతుతూ పరుగెత్తే గౌతమ్ అలాగే కూర్చోవడం సుధాకర్‌కు ఆశ్చర్యం కల్గించింది.

'చదుకోను.. ఇక్కడే ఉంటా''

''సరే నీ ఇష్టం'' అని వీక్లీ తిరగేస్తున్నాడు సుధాకర్. కొద్దిసేపాగి ''నాన్నా... నాన్న'' పిలిచాడు గౌతమ్... పుస్తకం మూసి

'' ఏం బాబు'' అనడిగాడు

''మామయ్య మనింటికెందుకొస్తున్నాడు?''

మామయ్యెప్పుడొస్తున్నాడని అడిగే గౌతమ్, అతని రాకకోసం రోజులు లెక్కపెట్టే గౌతమ్ ఎందుకొస్తున్నాడని అడగడం ఆశ్చర్యమనిపించింది సుధాకర్‌కు.. పుస్తకం టీపాయ్ మీద పెట్టి

'' ఎందుకు బాబూ?'' అన్నాడు.

''మామయ్య మనింటికి రాకపోతేనేం?''

''మామయ్య, నువ్వు దోస్తేకదా? ఎందుకలా అంటున్నావు?''

''అసలు మామయ్యెందుకు మనింటికి రావాలి?''

కొడుకును దగ్గరకు తీసుకున్నాడ సుధాకర్.

''మామయ్య చాలా మంచివాడుకదా బాబూ! మామయ్యమీద అంత కోపమెందుకొచ్చింది నీకు?''

''మామయ్యొస్తే నా కుందేలును కోస్తానంది అమ్మ... అందుకే మామయ్య మనింటికి రావద్దు'' అసలు కారణం చెప్పాడు గౌతమ్.

ఇప్పుడు సుధాకర్‌కు రెండ్రోజులుగా కొడుకెందుకలా వుంటున్నాడో అర్థమయింది. రెండురోజుల క్రితం తన తమ్ముని దగ్గర్నుంచి వచ్చిన లేఖను తనకిస్తూ- ''నాల్గురోజుల్లో మా తమ్ముడొస్తున్నాడు... కుందేలును కోసేద్దాం'' అని తన భార్య అనడం గుర్తొచ్చింది సుధాకర్‌కు. గౌతమ్ ఆ కుందేలునెంత ఆప్యాయంగా చూసుకుంటాడో సుధాకర్‌కు తెలుసు... ఇంటిలిజెంటయిన తన కొడుకు, వయసును మించిన తెలివితేటలున్న గౌతమ్ మనసెంత సున్నితమైందో సుధాకర్‌కు తెలుసు.

భార్యాభర్తలిద్దరూ ఎప్పుడైనా గొడవపడితే-

''మీరు కొట్లాడొద్దు.. ఎవ్వరిది తప్పయితే వాళ్ళను కొడతా'' అని నాలుగేళ్ళ వయసులోనే అనేవాడు గౌతమ్... అయినా గొడవ పడితే..

''అమ్మా... నీకు బుద్ధిలేదు. నాన్న నీ దోస్తే కచ్చీ'' అనేవాడు.

ఎన్నో తెలివయిన ప్రశ్నలేసేవాడు. అలాంటి గౌతమ్ మాటలను తేలికగా తీసుకోదలచుకోలేదు సుధాకర్. పసివాళ్ళ మాటలకు ఏమాత్రం విలువివ్వకుండా తోసివేస్తే ఫలితాలెలా వుంటాయో సుధాకర్‌కి తెలుసు. కుందేలంటేగౌతమ్‌కెంత ప్రాణమో అతనికి తెలుసు.

టీ తెచ్చి టీపాయ్‌పైన పెట్టి లోపలికెళ్ళింది గౌతమ్ తల్లి లక్ష్మి... కొడుకు తలపైన చేయుంచి

ఆప్యాయంగా నిమిరాడు.

''నీ కుందేలును కోస్తానంది కాబట్టి మీ మామయ్య రావద్దు... అవునా..?'' అన్నాడు సుధాకర్. తలూపాడు గౌతమ్.

''నీ కుందేలును కొయ్యకుంటే మామయొచ్చినా ఫర్వాలేదు..''

''అవును మామయ్య రావాలి''

కప్పుచేతిలోకి తీసుకొని టీ చప్పరిస్తున్నాడు సుధాకర్.

''కుందేలు కాలు విరిగింది కదా బాబూ! అందుకే దాన్ని కోస్తానంటుంది మీ అమ్మ... అదిప్పుడు పరుగెత్తలేదు.. కుక్కలవీ తింటాయని కోస్తానంటుంది'' అన్నాడు సుధాకర్.

''దానికి చేతకావటంలేదని కోసుకు తినాలా నాన్నా?'' సుధాకరేం మాట్లాడలేదు.

''మరి తాతయ్యకు కూడా చేతగావడంలేదు... కాలిరిగింది. ఇంట్లోంచి తరిమివేస్తే సరిపోతుందిగదా! మందులెందుకిప్పిస్తున్నారు?''

కొడుకు మాటలకవాక్కయ్యాడు సుధాకర్... అతనికేం జవాబు చెప్పాలో తోచడంలేదతనికి. టీకప్పు టీపాయ్ మీదుంచాడు.

''అవి జంతువులు.. మనం మనుషులం... తాతయ్యను తరిమిమేయడమెలా కుదురుతుంది? పెద్దచేప చిన్న చేపను తింటుంది. బల్లి పురుగును తింటుంది. ఆ బల్లిని మరోటి... ఇలా లోకంలో జరుగుతూనే వుంటుంది'' అన్నాడు సుధాకర్.

''జంతువులకు మనుషులకు తేడా వుందని మీరే చెప్పారు... ఆలోచించే శక్తున్న మనిషి కూడా ఇలా చేస్తే ఎలా వుంటుంది నాన్నా? మన రుచి కోసం ఇంకో ప్రాణిని చంపి తినాలా?''

తర్కబద్ధంగా మాట్లాడే గౌతమ్ మాటలకు సుధాకర్ దగ్గర జవాబులు లేవు. గౌతమ్ బుద్ధుడిలా ప్రాణులను ప్రేమిస్తూ భూతదయ కలిగివుండాలని కొడుక్కి బోధించాడు సుధాకర్. తాను చెప్పినవాట్నే ఆచరిస్తానంటున్న కొడుకులో ఆ గౌతమబుద్ధుణ్ని చూస్తున్నాడు సుధాకర్. ఈ లోకంలోని హింసాప్రవృత్తిగూర్చి, మానవనైజం గురించి, మనిషిలోని మృగాన్నిగూర్చి ఆ పసివాడికిచెప్పినా అర్థంచేసుకునే వయసుకాదనుకున్నాడు సుధాకర్.

''బాబూ! నువ్వు చిన్నపిల్లవాడివి... నీకు లోకం పోకడ తెలియదు.. వయసు వస్తున్న కొద్దీ నువ్వే అర్థం చేసుకుంటావు'' అన్నాడు సుధాకర్.

''నాన్నా.. నా కుందేల్నయితే కొయ్యొద్దు''

''దాని కాలు విరిగిపోయిందకదా బాబూ... అదెక్కువ రోజులు బతకదు''

''మందేసి కట్టుకడదాం... అదే బాగవుతుంది... నా కుందేలును కొయ్యొద్దు..''

''సరే.. మరి మామయ్యొస్తే ఎలా?''

''కూరగాయలవీ వండితే సరిపోవా నాన్నా.. మాంసమే వండాలనుకుంటేకొనుక్కురండి... నా కుందేల్నయితే ఇవ్వను''

''మాంసం ధర కిలోకు నలభై రూపాయలు.. ఇది నెలాఖరు'' అన్నాడు బాబు. ''మీ దగ్గర డబ్బుల్లేకుంటే నా డబ్బుల పిడతలను పగులగొట్టేస్తాను.. అందులో చాలా డబ్బులున్నాయి''

తన కుందేలును రక్షించుకోవడానికి తన కిడ్డీబ్యాంకునే పగులగొట్టి డబ్బిస్తాననే కొడుకును ప్రేమగా

దగ్గరకు తీసుకున్నాడు సుధాకర్. ఇంతసేపట్నుంచి వాళ్ళ మాటలు వింటూ పనిచేసుకుంటున్న లక్ష్మి వాళ్ళదగ్గరికొచ్చింది.

''వేలెడంతలేవు. వెధవా? పెద్దమాటలు మాట్లాడుతున్నావు.. పిడత పగులగొట్టి డబ్బిస్తాడట? పెద్దాలోచనే. మనం కొయ్యకున్నా కాలిరిగిన కుందేలును ఏ కుక్కో చంపి తింటుంది... ఈ పెద్దమనిషి ప్రశ్నలడుగుతున్నాడు. తండ్రి జవాబులు చెబుతున్నాడు.. నోర్మూసుకొని చదువుకో... మా తమ్ముడొస్తే కుందేలును కోయడమే'' అంది లక్ష్మి.

''నా కుందేలును కోస్తే నేనూర్కోను...'' ముఖం ముడుచుకొని అన్నాడు గౌతమ్.

''ఊర్కోకుంటే ఉరిపెట్టుకో... ఆరిందలా పెద్ద పెద్ద మాటలు.. వయసును మించిన బుద్ధులు. నువ్వేమన్నా తొమ్మిదేళ్ళ పిల్లాడిలా మాట్లాడుతున్నావా?'' అంది లక్ష్మి.

గౌతమ్ ముఖం మాడ్చుకున్నాడు... వాడికి దుఃఖమొస్తుంది.

''లక్ష్మి... పిల్లల మాటలనలా తేలికగా కొట్టివేయవద్దు... సముదాయించి ఒప్పించాలి. వాళ్ళన్నది కాదంటే మనమీద వ్యతిరేకత పెరుగుతుంది. బాబుని ఏమనకు'' అన్నాడు సుధాకర్.

''వాడికేదో పెద్దమనిషికి చెప్పినట్లు చెబుతున్నారు... తండ్రి తండ్రే, కొడుకు కొడుకే. గౌతమ్.. నువ్వు నీ గదిలోకెళ్ళి హోంవర్క్ చేసుకో... వెళ్ళు'' అని గద్దించింది లక్ష్మి.

''అనవసరంగా బాబునెందుకలా భయపెడ్తావ్...? లక్ష్మితో అని.

''బాబూ.. మామయ్యొచ్చినా నీ కుందేలునేం కొయ్యము. సరేనా? నాదగ్గర డబ్బులున్నాయి... నీ డబ్బుపిడత పగులగొట్టడం కూడా అవసరం లేదు... నువ్వెళ్ళి చదువుకో'' అని లేచాడు సుధాకర్.

తల్లికేసి భయం భయంగాచూస్తూ తన గదిలోకెళ్ళాడు గౌతమ్. నాన్నమాటలు. అమ్మ మాటలు మననం చేసుకుంటూ హోంవర్క్ పూర్తిచేశాడు.

పుస్తకం చేతిలోవున్నా వాడి ఆలోచనలన్నీ మామయ్యొచ్చే ఎల్లుండిగూర్చే...

''నాన్న కుందేలును కొయ్యనన్నాడు.. కాని అమ్మ? అమ్మ ఊర్కుంటుందా? సాధారణంగా అమ్మమాటకు నాన్న అడ్డుచెప్పడు. అమ్మేదన్నా చేయదల్చుకుంటే చేసి తీరుతుంది... మరి తన కుందేలు?''

''అమ్మ మంచిదికాదు... రాక్షసి- కాదు..కాదు. అమ్మకు తనంటే ప్రాణం. తనకేమాత్రం అనారోగ్యంగా వున్నా విలవిలలాడుతుంది. కాని తాను పసివాణ్ణని ఈ విషయంలో తన మాటలు చెవినిపెట్టడం లేదు.

ఇదంతా మామయ్యవల్లనే కదా! మామయ్య రాకుంటే సరిపోయేది. కాని మామయ్యేలాగూ వస్తున్నాడు. తన కుందేలునెలా రక్షించుకోవాలి..? ఇంట్లోవుంటే కుందేలును కోయకుండా ఆపడం కష్టం. కుందేలుతనకు దూరమయినా ఫర్వాలేదు... కాని ప్రాణంతో వుంటే చాలు'' రకరకాలుగా తర్జనభర్జన చేసుకున్న గౌతమ్ మెదళ్ళో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. వాడి హృదయ్యం తేలికయింది.

తెల్లవారింది. ఆ రోజు ఆదివారం కావడంవల్ల పొద్దంతా ఇంట్లోనే వున్నాడు. సమయమంతా కుందేలుతోనేగడిపాడు. ప్రేమగా చూసుకున్నాడు... ఆప్యాయంగా తాకాడు. తెల్లవారితే తననుండి దూరం కాబోతున్న ఆ మూగజీవిని తన దగ్గరే పడుకోబెట్టుకున్నాడు. ఆరోజు గడిచింది. తెల్లవారుతోంది. ఇంకొన్ని గంటల్లో గౌతమ్ మామయ్యొస్తాడు. అందరికంటే ముందే నిద్రలేచాడు గౌతమ్. కుందేలును పట్టుకొని

ఇల్లుదాటాడు. ఊరుబయటకు గబగబా నడుస్తున్నాడు. మెవెవరో తరుముతున్నట్టు నడుస్తున్నాడు. చెట్లు... గుబుర్లు.. కొంచెం దూరంలో ఓ గుట్ట. కుందేలును వదిలిపెట్టాడు.

ఆఖరికి అది అటూ తిరిగి ఇటు తిరిగి అతని దగ్గరకే వచ్చిది. ''నాదగ్గరుంటే నిన్ను చంపేస్తారు బుజ్జీ'' అని దూరంగా కొట్టాడు. కొంచెం వెనక్కి వెళ్ళి చెట్టుకింద నిల్చున్నాడు... కుందేలు మెల్ల మెల్లగా నడిచి పోవడం గమనించాడు. అతని ముఖంలో సంతోషం కుందేలు తన నుండి దూరమౌతోందన్న విచారం కంటే అది ప్రాణాలతో బయటపడ్డుందన్న సంతోషమే ఆ పసివాడికెక్కువగా వుంది. కాని ఆ పసివాడి సంతోషం ఎంతోసేపు నిలువలేదు. ఎక్కణ్ణించో ఓ కుక్క పరుగెత్తుకుంటూ వచ్చింది. కుక్కను చూసిన కుందేలు భయంతో పరుగెత్తబోయింది. కాని నొప్పిగా ఉన్న కాలు సహకరించలేదు. చేతిలో రాయిపట్టుకొని 'అడీ అడీ' అని అరుస్తూ పరుగెత్తాడు గౌతమ్. కాని అప్పటికే ఆలస్యమైంది. కుక్క కుందేలును నోటకరుచుకొని పరుగెత్తుతోంది. ఆగి రాయి విసిరాడు గౌతమ్. లాభంలేదు. అది గురితప్పి వృధా అయింది. మళ్ళీ పరుగెత్తబోయాడు గౌతమ్... కాలుకు ముల్లు గుచ్చుకుంది... ముల్లు పీకెయ్యడానికి నిలుచున్నాడు. ఈ లోగా కుక్క కుందేలును ఈడ్చుకుంటూ చాలాదూరం వెళ్లిపోయింది.

ఏం చేయాలో తోచక ఏడుస్తూ నిల్చున్నాడు గౌతమ్. కడుపునిండా దుఃఖం. కళ్ళవెంట నీరు.. నిస్సహాయంగా ఊరిముఖం పట్టాడు గౌతమ్. అతనికీ సమాజం సమాజంలా కనబడటం లేదు. క్రూర మృగంలా కనబడుతోంది. హింసా ప్రవృత్తే ప్రధాన ధర్మం గలదానిలా అగుపడ్తోంది. అతను పాఠశాలలో చదువుకున్న అహింసా పాఠాలు, బుద్ధుడి భూతదయ పాఠాలుచూస్తున్న విషయాలకు చాలా తేడా కనబడ్తోంది. 'జీవ హింస చేయరాదు' అని చదివినగౌతమ్‌కు ఈ లోకమే ఓ హింసరచనలా అనిపిస్తోంది. పుట్టెడు దుఃఖాన్ని కడుపులో పెట్టుకొని ఈడ్చుకుపోయిన ముఖంతో ఇంటికెళ్తున్న గౌతమ్ కళ్ళముందు పాలనురగలాంటి తెల్లని కుందేలు రూపమే కదులుతోంది. వర్తిచేతులతో పోతున్న తనను తల్లి కొడ్తుంది, తిడ్తుందన్న భయంకంటే, తన ప్రియమైన కుందేలు కుక్కబారిన పడిందన్న బాధే గౌతమ్‌కెక్కువగా ఉంది. తన ప్రాణానికి ప్రాణమైనచెవులపిల్లిని కోల్పోయినగౌతమ్‌కు ఈ లోకమనే గ్రంథం హింస చేయమని సందేశమిచ్చే సాహిత్యంలా దర్శనమిస్తోంది.

ఏడుస్తూ ఇంటికెళ్ళిన గౌతమ్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు తల్లిదండ్రులు. పల్లెత్తి ఒక్కమాటకూడా అన్లేదు... అమ్మ తనను కొడ్తుంది, తిడ్తుందని భావించిన గౌతమ్ ముఖంలో ఆశ్చర్యం, అతనిలో ఎన్నో ప్రశ్నలు...? ముఖంలో ప్రశ్నార్థకాలు.. అతనికే జవాబులు తెలియని ప్రశ్నలు...? ప్రశ్నలు...? ప్రశ్నలు...?

*విపుల మాసపత్రిక ఫిబ్రవరి 1991*